# తొందరపడి ఓ కోయిల ముందే కూసింది

పోస్టుమాన్ కిటికీలోంచి విసరిన కవరును గబగబా విప్పింది రాజ్యం - తెల్లని కాగితం మీదవున్న వాక్యం ఆమెని ఆశ్చర్య పరిచింది దీర్ఘంగా నిట్టూర్చి మళ్ళీ ఓ మాటు ఆ వాక్యం చదివింది. 'తొందరపడి ఓ కోయిల ముందే కూసింది' నీళ్ళు నిండిన కళ్ళని పమిటతో అద్దుకుంది ఆ వాక్యం కిందవున్న మూడక్షరాలని చూస్తూ.

"నువ్వూ, నేను ఒకేలాటి ఓణీ కొనుక్కుందామా" అంది లలిత ఇంక నాలుగు రోజులకి కాలేజీ తెరుస్తారనగా. "నీ ముఖం ఒకేరకం వోణీ వేసుకుంటే మాత్రం ఒకేలాగ వుంటామా ఏమిటి?" నవ్వింది రాజ్యం.

లలితకి తండ్రి లేడు. తల్లి, ఇద్దరు తమ్ముళ్ళు ఒక చెల్లెలు. లలిత ఆ యింటికి పెద్దపిల్ల కాపటంతో ఇంటి బాధ్యత అంతా ఆమెదే. తండ్రి బాంకులో వేసిన డబ్బుమీద నెలనెలా వచ్చే వడ్డీతో కుటుంబాన్ని జాగ్రత్తగా గడపాలి. రాజ్యం ఒక్కర్తె ఆడపిల్ల. ఒక్క అన్నగారు, రాజ్యానికి ఏ బరువు బాధ్యతలు లేవు

లలిత, రాజ్యం ఇద్దరూ ఇంటర్ సెకండియరు చదువుతున్నారు. నిజానికి తెలివి, చురుకుదనం రాజ్యంకన్న లలితకే ఎక్కువ. లలిత తల్లికి లలితను చూచినప్పుడల్లా బెంగగా వుండేది. అంతేకాదు, ఈ లలితమ్మతల్లి ఎప్పుడు చదువు పూర్తిచేసుకుని ఎప్పుడు ఉద్యోగంలో చేరుతుందో, ఎప్పుడు మా కష్టాలు తీగుతాయో అనుకునేది. ఇంటికి మగ పిల్లాడిలా బాధ్యతలన్నీ దానికే వున్నాయని ఎంతో బాధపడేది ఆమె.

"ఏమిటమ్మా - ఆడపిల్ల ఏమిటి, మగపిల్లాడేమిటి— నాన్నగారు లేనందుకు ఆయన బాధ్యతలన్నీ నేను చూడాలసిందే నువ్వెందుకు బెంగ పడతావు", అంటూ తల్లిని ఓదార్చేది లలిత.

"అక్కా, ఈ రోజు పరీక్షఫీసు కట్టాలి అక్కా నాకు యూనిఫారం కుట్టించాలి లేకపోతే స్కూలికి రానియ్యరట" నీ యిష్టం - అక్కా అక్కా—— తమ్ముడు, చెల్లెలు అంటుంటే,

లలితకి విసుగొచ్చేది. ఒక్కొక్కసారి నా ఖర్మకొద్దీ ఇవన్నీ నా నెత్తిన వచ్చిపడ్డాయనుకునేది. కానీ తనే విసుక్కుంటే ఈ రెక్కలు రాని పసివాళ్ళకి దిక్కెవరు అనుకోగానే లలిత కళ్లు నీళ్ళతో నిండేవి.

నిజానికి లలితకి ఇరవై నిండలేదు ఇంకా.

ఆరోజు లలిత భోంచేస్తుంటే వచ్చింది రాజ్యం. "లలితా తొందరగా తినవే - నీతో ఎంతో ముఖ్యమయిన విషయం చెప్పాలని వచ్చాను!" అంది ఎంతో ఆవేదనతో.

స్నేహితురాళ్ళిద్దరూ డాబామీద కూచున్నారు. రాజ్యం ఇంచు మించుగా ఏడిచినంత పని చేసింది.

"నాకు ఇప్పుడే పెళ్ళి వద్దని ఎంత మొత్తుకున్నా వినటం లేదు. అత్త కొడుకు ఇంట్లోనే వున్నాడట అందుకని నా మెడలో మూడుముళ్లు వేయించాలిట అబ్బబ్బ ఈ పెద్దవాళ్ళు ఎంత మొండివాళ్ళో!"

లలిత రాజ్యం చెప్పిందంతా వింది నిజమే! ఇప్పుడే పెళ్ళేమిటి ఈ

రోజుల్లో ఆడపిల్ల బాగా చదువుకోవాలి. తన కాళ్ళమీద తను నిలబడ గలగాలి. అంతే కాని అమ్మా నాన్న చెప్పారని ఎవర్నో ఒకర్ని చేసేసుకోకూడదు.

"అయినా, రాజ్యం! నువ్వు ఇంటరన్నా పూర్తి చేయలేదు ఈ పెళ్ళేమిటి - వద్దని చెప్పు - చంపుతారా ఏమిటి? ఏదో ఆలోచించు" అంది లలిత. రాజ్యం తలొంచుకుని కూచుంది.

నిజానికి రాజ్యానికి తల్లిదండ్రుల్ని ఎదిరించే ధైర్యం లేదు. అంతే కాకుండా పైకి ఎన్ని మాటలు చెప్పినా రామం బావంటే ఇష్టం కూడాను. ఆరోజు ఏదో గబగబా లలిత దగ్గర గోలపెట్టింది కాని ఆ తర్వాత ఆ విషయం మళ్ళా ఎత్తలేదు రాజ్యం.

ఆర్నెల్ల తర్వాత కల్యాణం బొట్టుతో, మధు పర్కాలతో పెళ్ళి పీటలమీదున్న రాజ్యాన్ని చూస్తున్నంత సేపు లలిత మనసు ఆందోళన చెందింది.

"ఏ వయసు అందం ఆ వయసుదే. రాజ్యం జీవితం ఇంక ఓ దారిన పడ్డట్టే- లలిత ఎక్కువసేపు పెళ్ళి పందిట్లో వుండలేక పోయింది.

తన జీవితానికి ఇలాంటి రోజు వుంటుందా ఎప్పుడైన లలిత. భవిష్యత్తు దట్టంగా అల్లుకున్న చీకటిలా కనిపించింది. నిజమే- తమ్ముళ్ళని చెల్లెల్ని ఓ దారికి తీసుకురావాలి. తల్లి విషయం కూడా తను చూడవలసిందే- ఆ తర్వాత పెళ్ళి విషయం ఆలోచించాలి- అప్పటికి తన జుట్టు పూర్తిగా తెల్లబడవచ్చు. కంటి చూపు తగ్గొచ్చు- లలితకు క్షణం నవ్వు వచ్చింది. కానీ వెంటనే చచ్చిపోయిన తండ్రిమీద బతికున్న తల్లిమీద విపరీతంగా కోపం వచ్చింది.

ఓ రోజు ఎదురు గదిలో వున్న అతన్ని చూడగానే ఆశ్చర్య పోయింది లలిత. తనవైపే కన్నార్పకుండా చూస్తున్న అతను ఆ గదిలోకి అద్దెకి ఎప్పుడొచ్చాడో తెలియక.

ఆర్నెల్లుగా ఆ గదిలో వుంటున్న రఘు ఓ రోజున తమ్ముళ్ళతో మాట్లాడటం, ఇంకో రోజు గుమ్మంలో నుంచుని తల్లితో కబుర్లు చెప్పడం ఇలా అప్పుడప్పుడు చూస్తూనే వుంది లలిత.

తన పేరిట కాలేజీకి వచ్చిన ఉత్తరం చూసి విస్తుపోయింది లలిత. ఒకటికి నాలుగుసార్లు చదువుకుంది అంతా అయోమయంగా వుంది. 'ఇది ఇది నమ్మాలా వద్దా' అనుకుంది క్షణం. తనని పెళ్ళి చేసుకునేందుకు ముందుకు వచ్చే ఇతని గురించి తనకేం తెలియదే— ఏమిటో ఏదో ఆందోళనతో గబగబా ఇంటికి వచ్చేసిన లలిత గుమ్మంలో ఎదురుగా కనిపించిన రఘును చూడగానే ఖంగారుపడింది.

ఈ విషయం అమ్మతో ప్రస్తావించి లాభం లేదు. ఆడపిల్ల పెళ్ళి తొందరగా అయిపోతే మంచిదని 'సరే' అన్నా అంటుంది. లేకపోతే ఈ లలిత వెళ్ళిపోతే కొన్ని ఇబ్బందులు వున్నాయనుకుని 'పెళ్ళే వద్దని' అన్నా అంటుంది. కనక తను ఈ విషయాన్ని గురించి ఎవరితో చెప్పుకోవాలి— లలితకి క్షణం మెదడు పనిచేయలేదు. కాని వెంటనే రాజ్యం కళ్ళముందు నిల్చింది. పెద్ద ఉత్తరం రాసింది రాజ్యానికి.

రాజ్యం దగ్గర నుంచి వెంటనే సమాధానం వచ్చేసింది....ఈ పరిస్థితుల్లో నువ్వు పెళ్ళి గురించి ఆలోచించద్దు, నీ కాళ్ళమీద నువ్వు నిలబడాలి. నీ కుటుంబాన్ని ఓ దారికి తేవాలి. అంతేకాదు ఆ అబ్బాయి గురించి పూర్తి వివరాలు నీకేమీ తెలియవని రాసావు. కాబట్టి నీవు పెళ్ళి విషయం మానేసి చదువు గురించి ఆలోచించు. ఈ పరిస్థితుల్లో నువ్వు ఇప్పుడు పెళ్ళి చేసుకోడం కన్నా, ఇంకో నాలుగేళ్ళు ఆగితే నీకు చాలా మంచి భవిష్యత్తు వుంటుంది— నా వుత్తరాన్ని సరిగ్గా అర్థం చేసుకుంటా వనుకుంటాను, తొందరపడవద్దు ఇవీ రాజ్యం దగ్గరనుంచి వచ్చిన ఉత్తరం లోని విశేషాలు. నాలుగైదుసార్లు చదివింది. కళ్ళు ఎర్రబడ్డాయి. వెంటనే సమాధానం రాసేసింది. 'ఏమే రాజ్యం - నువ్వు పదిహేడేళ్ళు నిండకుండా

పెళ్ళి చేసుకుని, హాయిగా నీ కాపరం నువ్వు చేసుకుంటున్నావు. ఇంటరు పూర్తయినా చేయలేదు— మరి నా విషయంలో ఇదేం సలహా"—

రాజ్యం దగ్గరనుంచి మళ్ళీ సమాధానం వచ్చింది, "లలితా! ఆడ పిల్లకి పెళ్ళి చాలా అవసరం — కానీ నువ్వు నీ కాళ్ళమీద నిలబడ్డప్పుడు మీరిద్దరూ ఎవరిమీదా ఆధారపడక్కర్లేనప్పుడు, అతని గురించి నీకు పూర్తిగా తెలిసాక, నువ్వీ పెళ్ళి చేసుకుంటే నేను వద్దనను కానీ, తొందర పడి మంచి అవకాశాన్ని వదులుకో కూడదు అడిగాడు కదా అని. పోన్లే పెళ్ళయితేనే జీవితానికి ఒక ఆధారం దొరుకుతుందని నువ్వు పెళ్ళిచేసు కునే అవసరం లేదు. పెళ్ళి విషయంలో ఎంత ఆలోచిస్తే అంత మంచిది. తొందరపడి తర్వాత విచారిస్తే లాభం లేదు!

ఈ మాటు ఉత్తరాన్ని చూడగానే లలితకి చాలా కోపం వచ్చింది

"నువ్వు రాసిన ఉత్తరానికి అర్థముందా అసలు — నాకూ వయసు వస్తోంది — ఓ మగాడి అండ దండలు అవసరమని ఎందుకు అర్థం కాదు నీకు. ఎవరేమనుకున్నా సరే నేను పెళ్ళి చేసుకుతీరుతాను. నేను కుటుంబం కోసం ఎలాటి త్యాగము చేయదల్చుకోలేదు.

అతనికి మంచి బిజినెస్ వుందిట — తల్లి పల్లెటూళ్ళో ఉంటుంది — ఆర్నెల్లుగా నన్ను గమనించి ఈ నిర్ణయం తీసుకున్నాట్ట — కట్నాలు కానుకలు ఇచ్చి నాకు పెళ్ళి చేసేవారెవరో నువ్వే చెప్పు. అతను చాలా మంచివాడు — నేను అతనితో మాట్లాడాను — ఎంతో నిజాయితీపరునిలా అనిపించింది అతనితో మాట్లాడుతుంటే — నువ్వు నా మనసు దయుంచి చెడగొట్టకు.

తొందరపడి పెళ్ళి చేసుకుంటే, ఆ ఫలితాలు మంచికాని చెడ్డకానీ నేనే అనుభవిస్తానుగా- చాలా తీవ్రంగా రాసేసింది లలిత రాజ్యానికి సమాధానం.

నాలుగైదు ఉత్తరాలకి సమాధానం లేక రాజ్యం విసిగిపోయి పూరుకుంది చివరకి.

లలిత దగ్గర్నించి ఉత్తరాలు రావటం పూర్తిగా తగ్గిపోయాయి. ఆమె సంసారం చూడాలని ఎంతో ఆరాటపడింది రాజ్యం.

అనుకోకుండా గుమ్మంలో కొచ్చిన రాజ్యాన్ని చూసి ఆశ్చర్య పోయింది లలిత.

రాజ్యం వంటింట్లో పీట వేసుకు కూర్చుంది.

"బలే లావయ్యావే నువ్వు" అంది లలితతో. లలిత నవ్వేసి వూరుకుంది. ఎప్పుడో చిన్నప్పటి కబుర్లు చెప్పుకున్నారు చాలాసేపు. కానీ ఎంతకీ రఘు కనిపించలేదు రాజ్యానికి. ఎన్నో విషయాలు మాట్లాడింది అతని విషయం తప్ప. కొందరి దాంపత్యం ఎంతో చిత్రంగా వుంటుందిలావుంది అనుకొంది రాజ్యం. అప్పటికీవుండబట్టలేక, "ఏమిటే లలితా, మీ ఆయన ఏడీ? నేను పొద్దున్నగా వచ్చాను, ఇంత వరకు కనిపించనేలేదు ...." అంది.

"ఈమధ్య మా ఆయన కొత్త బిజినెస్ ఏదో పెట్టాలని ప్రయత్నం— ఆ ప్రయత్నంలో చాలా బిజీగా వుంటున్నారనుకో" అంది నవ్వి. ఆ నవ్వులో జీవం కనిపించలేదు రాజ్యానికి. లలిత ఇంట్లో రెండు రోజు లుంది. ఈ రెండు రోజుల్లోనూ ఒక్కసారి వచ్చి ఓ గంట వుండి వెళ్ళి పోయాడంతే. అతన్ని చూసి విస్తుపోయింది రాజ్యం, ఏదో తప్పు చేసిన వాడిలా తప్పించుకు వెళ్ళిపోతుంటే.

ఆ రాత్రి స్నేహితురాళ్ళిద్దరూ వెన్నెల్లో పడుకుని చాలా కబుర్లు చెప్పుకున్నారు. ఎప్పుడో ముచ్చట్లు చెప్పుకు నవ్వుకున్నారు.

"ఒసే రాజ్యం – నేను తొందరపడి పెళ్ళి చేసుకున్నాననే ఇంకా అనుకుంటున్నావా?".... అంది లలిత ఒక్కసారిగా.

రాజ్యం ఉలిక్కిపడింది. "అదేమిటీ?–అప్పట్లో అలా రాసానంతే–మీకేం హాయిగా వున్నారు – నువ్వే అన్ని నిర్ణయించుకోవాలి కాబట్టి తొందరపడవద్దన్నానంతే కానీ – ఒసేయ్ లలితా, మీ ఆయన పెద్ద బిజినెస్ మాగ్నట్ అయిపోతే నీ కళ్ళకి నేను కనిపిస్తానే? నవ్వుతున్న

రాజ్యం ఆగిపోయింది. ఆ వెన్నెల్లో మిలమిల మెరుస్తున్న కన్నీళ్ళు ఒత్తుకుంటున్న లలితని చూస్తూ.

మరో ఆర్నెల్ల తర్వాత లలిత విశేషాలన్నీ పుట్టింటినించి విన్న రాజ్యం గుండె ఆగినంత పనయింది. రఘు లలితని పెళ్ళి చేసుకున్నా, వుండటం, డబ్బు ఇవ్వటం అంతా జయకేనని, జయకి ఒక కొడుకని విని రాజ్యం కన్నీళ్ళు ఆగలేదు; దిండులో తల దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది. స్నేహితురాలికి జరిగిన అన్యాయాన్ని తెలుసుకుని.

బల్లమీద పడివున్న తెల్ల కాగితంలో అక్షరాలు రాజ్యం గుండెల్ని కదల్చివేస్తుంటే, ఆ కాగితం గాలికి రెపరెప లాడుతూ ఎటో ఎగిరి పోయింది.

* [రవి ఆర్ట్స్ అసోసియేషన్ సంచిక] *